ఈనాడు
epaper.eenadu.net

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రోడ్‌మ్యాప్

- తక్షణం సిద్ధం చేయాలని సీఎం ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికల అమలుకు వెంటనే రోడ్‌మ్యాప్ తయారు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్డు అనుసంధానంపై ప్రణాళికలను అధికారులు వివరించారు. దాన్ని పరిశీలించిన సీఎం వివిధ సూచనలు చేశారు. "ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు అనుసంధానం ఉండేలా రోడ్‌మ్యాప్ రూపొందించాలి. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేయాలి. హైకోర్టు కొత్త భవనం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలుమార్గం ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలి. రోడ్లు, మెట్రో మార్గాలకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. వీలైనంత త్వరగా పూర్తిస్థాయి ప్రణాళికలను, రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలి. ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి" అని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## మహారాష్ట్ర కాంగ్రెస్ వార్‌రూం ఇన్‌ఛార్జిగా వంశీచంద్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాబోయే ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాలకు కాంగ్రెస్ వార్‌రూం ఇన్‌ఛార్జులను నియమించారు. మహారాష్ట్రకు చల్లా వంశీచంద్‌రెడ్డిని, హరియాణాకు నవీన్ శర్మను, జమ్మూ-కశ్మీర్‌కు గోకుల్ బుటైల్‌ను నియమించినట్లు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచార కార్యక్రమాలను, వ్యూహాల అమలును వీరు పర్యవేక్షిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి పొంగులేటి, వివిధ శాఖల అధికారులు